# మాతృత్వం

రాజ్యలక్ష్మి కొలాస్కర్

అదొక ఆధునికమైన హొటల్. యజమానుల అభిరుచికి అడుగడుగునా ప్రాధాన్యత నిచ్చినట్లున్న ఆ హొటల్ మనసుకి అత్యంత ఆహ్లాదంగా ఉంది. గోడలమీది అందమైన పెయింటింగ్స్ చక్కటి లైటింగ్ ఎఫెక్ట్స్ తోడు చేసుకుని మనసు దోచుకుంటున్నాయి. మంద్ర స్థాయిలో వినిపిస్తున్న వెస్టర్న్ మ్యూజిక్‌కి కూర్చున్న వారి తలలు, పాదాలు లయబద్ధంగా ఊగుతున్నాయి.

డ్రింక్స్ కాబినెట్‌కి ప్రక్కగా అందమైన నగిషీలు చెక్కిన తలుపు ఉంది. దానిపై బంగారు రంగు అక్షరాలతో "మేనేజర్" అని ఇంగ్లీషులో వ్రాసి ఉంది. స్మార్ట్‌గా ఉన్న స్టువర్డ్ ఒకతను ఆ తలుపుపై మెల్లిగా తట్టి తలుపు తీశాడు.

టేబిల్ మీదున్న కాగితాలు దీక్షగా చూస్తున్న వందన తలెత్తి అతడి వంక ప్రశ్నార్థకంగా చూసింది.

గౌరవం ధ్వనిస్తున్న కంఠంతో చెప్పాడతను. "మేడమ్! ఒకాయన సాయంత్రం అయిదున్నర ప్రాంతాల ఒంటరిగా వచ్చాడు. వచ్చినప్పట్నుంచి డ్రింక్ తీసుకుంటున్నాడు. ఇప్పుడు చూస్తే టేబిల్ మీదికి వాలిపోయి ఉన్నాడు. మన లోకంలో ఉన్నట్లు లేదు. కుదిపి పిలిచినా పలకటంలేదు. బిల్ దాదాపు రెండు వందలవరకు అయింది. ఏం చెయ్యమంటారు?"

రెండు నిమిషాలు ఆలోచిస్తూండిపోయింది వందన. "ఇదివర కెప్పుడూ రాలేదా?"

"చూసిన గుర్తు లేదు, మేడమ్. పర్స్ తీసి అడ్రెస్ ఉందేమో చూద్దామన్నా తతిమా కస్టమర్సు అపార్థం చేసుకుంటారేమోనని..."

"మంచి పని చేశారు. మనిషి ఎలా ఉన్నాడు? అంటే డ్రెస్...?"

"పెద్దమనిషి లాగానే ఉన్నాడు, మేడమ్."

ఆ సమాధానానికి ఆమె పెదవులపై చిరునవ్వు మెదిలింది. ఒళ్ళు తెలియకుండా తాగి పడిపోయిన వ్యక్తి పెద్దమనిషి!

"పదండి! నే నొస్తున్నాను." స్టువర్డ్ వెనుక నడిచింది వందన. ఒక మూలగా ఉన్న టేబిల్ దగ్గరికి దారి తీశారు. ఆ వ్యక్తిలో చలనం లేదు. దగ్గరగా వెళ్ళి అతని ముఖంలోకి చూసిన వందన ఉలిక్కిపడింది. "అరె! రాధాకృష్ణ!" అప్రయత్నంగా పైకి అనేసింది.

'ప్రపంచం ఎంత చిన్నది! జీవితంలో మళ్ళీ ఇతణ్ణి చూస్తానని అనుకోలేదు తను. అసలు చూడకూడదనే కోరుకుంది. పదేళ్ళ తరువాత ఇలా తారసపడటం! ఇక్కడే ఉంటున్నాడా! ఉంటే భార్యతో వచ్చేవాడే కదా! ఒకవేళ ఏదైనా పనిమీద వచ్చేడేమో!'

"మీకీయన తెలుసా, మేడమ్!" స్టువర్డ్ ప్రశ్నతో ఆలోచనల గొలుసు తెగింది.

"నేను చదువుకునే రోజుల్లో ఈయన రి సెర్చి చేసేవాడు. మాకు డిమాన్‌స్ట్రేటరుగా వచ్చేవాడు."

కొంచెం సేపు ఆలోచించి అతనితో చెప్పింది- "ఈయన్ని నా కారు వెనుక సీట్లో పడుకోబెట్టండి. డ్రైవర్‌ని పిలిచి పదినిమిషాల్లోనే నొస్తున్నానని చెప్పండి."

చకచక తన రూమ్‌కి వెళ్ళి కాగితాలన్నీ సర్దేసింది. ముఖ్యంగా ఇవ్వవలసిన డైరెక్షన్స్ ఇచ్చి కారులో కూర్చుంది. పావు గంటలో ఇంటికి చేరుకుంది కారు.

"డ్రైవర్ మాలిని పిలిచి ఇద్దరూ కలిసి ఈయన్ని మన గెస్ట్ రూమ్‌లో పడుకోబెట్టండి."

కారు శబ్దం, దాని వెనుక తల్లి గొంతు విన్న పిల్లలిద్దరూ పరుగెత్తుకొచ్చేశారు. "మమ్మీ, ఈరోజు త్వరగా వచ్చేశావు. భలే, భలే. నాకు మంచి కథ చెప్పాలి." చిన్నవాడు గారంపోయాడు.

"అలాగే, నాన్నా! డాడీ రాలేదా ఇంకా?"


"లేదు, మమ్మీ! లేట్‌గా వస్తానని ఫోన్ చేశారు."


"అన్నం తిన్నారా?"

"ఇప్పుడే పెట్టింది, మమ్మీ, ఆయా! నువ్వూ రా!"

ఇద్దరూ రెండు చేతులూ పట్టి లాక్కెళ్ళారు. భోంచేసి కథ చెప్పి పిల్లలిద్దరూ నిద్రపోయాక తమ గదిలోకి వచ్చింది.

'ఈయ నెప్పు డొస్తారో!' అనుకుంటూ పుస్తకం పట్టుకుని బెడ్‌మీదికి ఒరిగింది. కాగితాలు తిప్పుతూందే కాని మనసు దానిమీద లగ్నం కావటం లేదు. నిమిష నిమిషానికీ కాళ్ళు, చేతులూ వేళ్ళాడేసి తెలివి లేకుండా పడి ఉన్న రాధాకృష్ణ రూపం గుర్తొస్తోంది. దానితోపాటు మరెన్నో





అవాంఛనీయమైన జ్ఞాపకాలు. దాదాపు మనను లోంచి తుడిచేశా ననుకుంటున్న చేదు జీవితాధ్యాయం కళ్ళముందు నిలుస్తోంది.

** ** **

ఆడపిల్లల హాస్టలు సందడిగా ఉంది. నవ్వులు, కేరింతలు, జోక్స్‌తో కారిడార్స్ ప్రతిధ్వనిస్తున్నాయి. ఉత్సాహం అంతా అక్కడే ఉన్నట్టుంది. అవును, మరి! సెమిస్టర్ పరీక్ష లయిపోయాయి. నెల రోజులు సెలవులు. పెట్టెలు సర్దుకుంటూ వెళ్తున్న వారికి వీడ్కోలు చెప్తూ మధ్య మధ్య గిల్లిక జ్జాలతో కోలాహాలంగా ఉంది.

వందన రూమ్‌మేట్ జ్యోతి కూడా ఆ రోజే వెళ్ళిపోతోంది. వందనకి మాత్రం ఆ రోజు రిజర్వేషను దొరకలేదు. మర్నాటికి దొరికింది. అందుకని రవంత నిరుత్సాహంగా ఉంది. ఈ రాత్రికి రూమ్‌లో తనొక్కతే ఉండాలే అనుకుంటే బెంగగా ఉంది.

"వందనమ్మగారూ!" వాచ్‌మన్ పిల్చాడు. "మీకు విజిటర్సు."

వందన ముఖం వికసించింది. జ్యోతి పరిహాసమాడింది. "నీ కృష్ణు డొచ్చాడు కాబోలు. ఇంకయినా ఆ కేక్ట్రాయిల్ ఫేస్ మార్చు. నువ్వొచ్చేసరికి లేటవుతుందేమో. ఇప్పుడే టాటా చెప్పేస్తున్నాను. సెలవుల్లో ఉత్తరాలు వ్రాస్తావు కదూ!" తల ఊపేసి తన తాళంచెవి తీసుకుని తూనీగలా పరిగెత్తింది వందన. రాధాకృష్ణ గేటు దగ్గర నిలబడి ఉన్నాడు. ఆమె రాగానే ఇద్దరూ బీచ్ వైపుకి దారితీశారు.

నడిచి నడిచి జనం లేని చోట మెత్తటి ఇసుకలో కూలబడ్డారు. వందన చెయ్యి పట్టుకుంటూ అన్నాడు: "రేపే కదూ నువ్వెళ్ళేది? అబ్బ! నెలరోజులా మరీను! మన వెధవ యూనివర్సిటీకే ఇన్ని సెలవులు! ఒక వారం రోజు లిస్తే చాలదూ!"

వందన చిలిపిగా నవ్వింది. "పోనీ, మీరుకూడా నాతో వచ్చెయ్యండి. అమ్మా వాళ్ళకి కాబోయే అల్లుణ్ణి చూపిస్తాను."

"కాబోయే అల్లుడిగా అయితే మర్యాదలు అంత జోరుగా జరగవోయ్! అల్లుడిగానే వచ్చి అలకపాన్పు ఎక్కుతాను."

వందన సీరియస్‌గా అయింది. "ఏమండీ! జోక్స్ సంగతి తరువాత. నాకు ఇంకో సెమిస్టరే మిగిలింది. ఆ నాల్గు నెలలూ అయిపోతే, ఇక్కడ రిసెర్చిలో అడ్మిషను దొరక్కపోతే మీ రోచోట, నే నోచోట అయిపోతాము. మీ థీసిస్ ఇప్పుడిప్పుడే అయ్యే సూచనలు కన్పించటంలేదు. ఎన్నాళ్ళిలా! అమ్మావాళ్ళకి నా గురించి ఎవరో అవాకులూ చవాకులూ చెప్పేముందే నేను చెప్తే బావుంటుందండీ!"

"ఆ మాట నిజమే, వందనా! కాని, చెప్పిన దగ్గర్నుంచి పెళ్ళి, పెళ్ళి అని ఆరాట పెడతారు. పెళ్ళయ్యాక వాళ్ళమీద ఆధారపడటం బాగుండదు. నా కొచ్చే నాలుగొందల ఫెలోషిప్‌మీద ఎలా బతుకుతాం చెప్పు? నీ చదువయ్యేలోగా ఉద్యోగంకోసం ట్రై చేస్తాను. వెంటనే పెళ్ళి. సరేనా?"

మరేమీ అన్లేని వందన తల ఊపింది. కబుర్లలోనే చీకటి పడింది. "పద, హోటల్‌కి పోయి భోజనం చేద్దాం!" రాధాకృష్ణ తను లేచి వందనకి చెయ్యందించాడు. ఆ చేతి ఆసరాతో లేచిన వందనని గబుక్కున మీదికి లాక్కుని ముద్దు పెట్టుకున్నాడు.

"పెళ్ళికి తొందరలేదుగాని, చిలిపితనానికి మాత్రం ఎక్కడ లేని తొందర." ముద్దుగా విసుక్కుంది వందన.

భోజనం చేసి పాన్ వేసుకుని బస్ స్టాండులో నించున్నారు.

"వందనా! నెలరోజులు కన్పించవనుకుంటే చాలా బెంగగా ఉందోయ్! ఎన్ని కబుర్లు చెప్పినా తనివితీరటం లేదు. మరికొంచెం సేపు ఉండి వెళ్దూగాని. నా రూమ్‌కి వెళ్దాం రారాదూ!"

"ఈ వేళలోనా! అదీ మిమ్మల్ని నమ్మి!"

"బుద్ధిగా ఉంటాను. ప్రామిస్... ఒక్క గంట. ఆ తరువాత ఎలాగూ నీ రూమ్‌లో ఒంటరిగా నువ్వు, నా రూమ్‌లో ఒంటరిగా నేను! ప్లీజ్... రా, వందనా! ఇదివరలో ఎన్నిసార్లడిగినా రాలేదు నువ్వు. అప్పుడు బలవంతం చేశానా నేను! నా రూమ్ చూడాలన్పించటం లేదూ నీకు?"

వందన మెత్తబడిపోయింది.

రూమ్ తలుపులు తీస్తూ గర్వంగా డిక్లేర్ చేశాడు. "ఇదే మన సామ్రాజ్యం— పట్టమహిషికి సుస్వాగతం!"

వందన లోనికి వచ్చాక తలుపులు వేసి ఆమెవైపు తిరిగాడు. "చూశావా! ఎంత నీట్‌గా పెట్టుకున్నానో! నా లాంటి భర్త దొరకటం నీ అదృష్టం. తెలుసా!" కాలర్ పైకెత్తాడు.

"చాల్లెండి బడాయిలు." మంచంమీద కూర్చుని కాళ్ళు పైకి పెట్టుకుని కుచ్చిళ్ళు సర్దుకుంది. ఉన్న ఒకే ఒక కుర్చీలో రాధాకృష్ణ కూర్చున్నాడు. బొమ్మలా కూర్చున్న వందనవైపు చూస్తూండిపోయాడు. తాంబూలం వేసుకున్న ఎర్రని పెదవులు అందంగా మెరుస్తున్నాయి. కిటికీలోంచి వీస్తున్న గాలికి జుట్టు ఎగిరి ముఖంమీద పడుతోంది. వాటిని సవరించుకుంటున్న తెల్లటి వేళ్ళ గోళ్ళు నెయిల్ పాలిష్‌తో వగడాలని మరిపిస్తున్నాయి. ఎప్పుడూ చూసే వందనే అయినా, ఏకాంతంలో కొత్త అందాలు కన్పిస్తున్నాయి.

వందన ఇబ్బందిగా కదిలి అంది: "ఏవో కబుర్లు చెప్తానని తీస్కొచ్చారు. తీరా వచ్చాక మౌనిలా కూర్చున్నారు."

"నీ రాకతో ఈ రూమ్‌కే అందం వచ్చింది, వందనా! నిన్ను ఇలా చూస్తూ రాత్రి గడిపివేయాలనుంది. మాట్లాడాలన్పించటం లేదు."

"చూసే ఓపిక మీ కున్నా, కూర్చునే ఓపిక నాకు లేదు, బాబూ! అంతగా కావాలంటే నా ఫోటో చూస్కోండి. నేను వెళ్తాను. వానకూడా వచ్చేట్టుంది." లేచి నిలబడింది.

"అరరే! అప్పుడే లేవకు." రాధాకృష్ణ గబుక్కున లేచి ఆమె భుజాలమీద చేతులు వేశాడు కూర్చోబెట్టటానికి. విసురుగా వచ్చిన గాలి కెరటానికి వందన పైట జారింది. ఆమె సర్దుకునే లోపల గబుక్కున గుండెకి హత్తుకున్నాడు. బయట నిమిష నిమిషానికి వేగం పెంచుకుంటున్న గాలి హోరుకి చినుకుల చప్పుడు తోడయింది.

బయట పెద్ద మెరుపు మెరిసింది. వెంటనే రూమ్‌లో లైటు ఆరిపోయింది.

ఒక గంట సేపటికి లైట్లు వచ్చాయి. వందన ముఖంలో మాత్రం కాంతి మచ్చుకికూడా లేదు. జరిగినదానికి సిగ్గుతో, భయంతో, అవమానంతో చితికిపోతూ ముఖం తలగడలో దాచుకుంది. రాధాకృష్ణని నిందించి ప్రయోజనం లేదని ఆమెకి తెలుసు. 'ఇద్దరి తప్పు సమానమే! అసలు తనది పెద్ద తప్పు. "అరిటాకు ఆడది" సామెత తెలిసి ఇంత తెలివితక్కువగా ప్రవర్తించటం! ఛీ! ఛీ!'

రాధాకృష్ణ మాత్రం తన తొందరపాటుకి ఏమాత్రం చింతించలేదు. వందన ముఖం తనవైపుకి తిప్పుకుంటూ అన్నాడు: "వందనా! జరిగినదాన్ని మార్చలేము కదా! బాధపడి ఏం ప్రయోజనం! నువు సెలవులు సంతోషంగా గడిపి రా! నువ్వొచ్చిన వెంటనే రిజిస్టర్ మారేజి చేసుకుందాం. నాకు ఉద్యోగం దొరికేవరకు పెళ్ళి విషయం పెద్దవాళ్ళకి చెప్పద్దు. అలాగైతే నువ్వు హాస్టల్లో ఉండి చదువు పూర్తి చెయ్యొచ్చు. ఏమంటావు?"

"ఏమనగలను? మీ ఇష్టం?"

** ** **

అన్యమనస్కంగా, అతి కష్టంగా సెలవులు గడిపేసి యూనివర్సిటీకి తిరిగి వచ్చింది. డిపార్టుమెంటులో రాధాకృష్ణ కన్పించలేదు. వాకబు చేయగా రెండు రోజుల క్రిందటే నెల రోజులు సెలవు తీసుకుని వాళ్ళ ఊరు వెళ్ళాడని తెలిసింది. మరో రెండు రోజులకి రాధాకృష్ణ క్లుప్తంగా వ్రాసిన ఉత్తరం అందింది.

"ప్రియమయిన వందనా!

మా నాన్నగారికి హఠాత్తుగా పక్షవాతం వచ్చింది. ఇంక ఉద్యోగం చెయ్యలేరేమో! ఇక్కడి వ్యవహారాలన్నీ చూసుకునేసరికి టైమ్ పట్టవచ్చు. పని ఒత్తిడిలో ఉత్తరాలు రాయకపోయినా కంగారు పడవద్దు.

-రాధాకృష్ణ."

రోజులు యుగాల్లా గడుస్తున్నాయి వందనకి. ఎంతగా ప్రయత్నించినా చదువుమీద మనసు లగ్నం చెయ్యలేకపోతోంది. రాధాకృష్ణమీద ఎంత నమ్మకమున్నా, మనసు కీడునే శంకిస్తోంది. రోజులు గడిచిపోతున్నాయి. పరీక్షలు దగ్గర పడుతున్నాయి. నెలా పదిహేను రోజుల నరకం తరువాత చుక్క తెగి పడ్డట్లు వచ్చాడు రాధాకృష్ణ.

ఆ రోజు సాయంత్రాన్ని, రాధాకృష్ణ మాటల్ని జీవితంలో మర్చిపోలేదు వందన. ఎన్నాళ్ళ తరువాత ఆమె ముఖం కళకళలాడితే, రాధాకృష్ణ మాత్రం అతి మామూలుగా ఉన్నాడు. తండ్రి గురించిన వేదన అయి ఉంటుందని మనసు సమాధానపరుచుకునేలోగా మొదటి పిడుగు పేల్చాడు.

"వందనా! ఈ రోజు డిపార్ట్‌మెంటులో నా రెజిగ్నేషను లెట రిచ్చేశాను."

వందన నోట మాట లేకుండా అతనివైపే చూస్తుంటే మరో పిడుగు. "వారం రోజుల క్రిందట నాకు మా మేనమామ కూతురితో పెళ్ళయింది."

ఏడ్చి, తిట్టి, జుట్టు పీక్కుని తన కాలరు పట్టుకుంటుందేమో అనుకున్న రాధాకృష్ణ వందన విగ్రహంలా ఉండిపోవడంతో ఏం చెప్పాలో తోచనట్లు కొంచెం సేపు మూగగా ఉండిపోయాడు. ఆ నిశ్శబ్దం మరీ ఇబ్బందిగా ఉండటంతో తనే మాటలు వెతుక్కుంటున్నవాడిలా చెప్పసాగాడు.

"వందనా! నా కొచ్చే ఫెలోషిప్ దాదాపు నాకే సరిపోతోంది: మా నాన్న ఉద్యోగమే కుటుంబానికి ఆధారం. పక్షవాతం పుణ్యమా అని అది కాస్తా పోయింది. నా చదువుకోసం ప్రావిడెంటు ఫండులో, ఇన్సూరెన్సులో, ఎక్కడ దొరికితే అక్కడ అప్పులు చేశాడు. నా తరువాత ఇంకా ఇద్దరున్నారు. నాకు ఇమ్మీడియెట్‌గా ఉద్యోగం దొరుకుతుందనే ఆశ లేదు. దొరికినా ఆ జీతంలో నా సంసారం, రోగిష్టి తండ్రి, పిల్లల చదువులు- ఇవన్నీ సాధ్యపడతాయా! అయోమయంగా దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుకుంటుంటే, మా మామయ్య ఈ మార్గం చూపించాడు. ఆయనకి ఒక్కతే కూతురు. చదువు లేదు. ఆయనకేమో ఫారిన్ రిటర్న్డ్ అల్లుడు కావాలని ఆశ. నన్ను రిసెర్చికి అమెరికా పంపి నా కుటుంబ భారాన్నంతా తనే తీసుకుంటానన్నాడు. మరి గత్యంతరం లేక ఒప్పేసుకున్నాను. అయామ్ సారీ, వందనా!"


చివరి రెండు వాక్కులకి వందనకి ఒంటికి కారం రాసినట్లయింది. పదునుగా అంది: "హృదయంలోని 'సారీ'ని అనవసరంగా మాటల్లో ఎందుకు వ్యక్తం చెయ్యటం! గత్యంతరం లేదని మీరు మిమ్మల్ని మభ్యపెట్టుకోండి. నన్ను కాదు. మనసుంటే మార్గ ముంటుంది. ఒక్క రెండు నెలలు ఎలాగోలా గడిపితే నేనూ ఏదో ఒక ఉద్యోగంలో చేరేదాన్ని. మీ భారాన్ని సంతోషంగా పంచుకునేదాన్ని."

"ఎంత తెలివితక్కువగా మాట్లాడుతున్నావు, వందనా! ఉద్యోగాలు మనకోసం కాచుకుని ఆహ్వానిస్తున్నాయా! మనిద్దరం పెళ్ళి చేసుకుంటే మా అందరితోబాటు అర్ధాకలితో నువ్వూ మాడిపోయేదానివి. ఆ రొంపిలోకి నిన్ను లాగటం ఇష్టం లేకనే ఈ దారి ఎన్నుకున్నాను."

"ఎంత దయ! ప్రేమ! డబ్బు, విదేశాల మోజు! వీటికి ఎందు కంత అందమైన బురఖా తగిలిస్తారు?"

"వందనా! ఆవేశంలో ఉన్నావు. నేనేం చెప్పినా నమ్మవు. నువ్వేమైనా అనుకో! నేను చేయగల్గిందేమీ లేదు. నాతో పరిచయాన్ని మరిచిపోయి కొత్త జీవితాన్ని ప్రారంభించమని నా అభ్యర్థన."

"మీవంటి వ్యక్తిని మరిచిపోవటంకంటె సంతోషం మరొకటుండదు. కాని, నా ప్రారబ్ధంకొద్దీ మీ నట చాతుర్యానికి లొంగిపోయి నా జీవి



తంమీద ఆ నాడు ఏర్పరచుకున్న మచ్చ నాలో దినదినప్రవర్థమానంగా పెరుగుతోంది."

"వందనా!" రాధాకృష్ణ అప్రతిభుడయ్యాడు. "ఈ విషయం నా కెందుకు వ్రాయలేదు?"

"వ్రాస్తే ఏం చేసేవారు?"

దిక్కులు చూశాడు రాధాకృష్ణ! వందనే అంది: "అప్పుడూ ఇదే సమాధానం లభించేది. నేను నిస్సహాయుణ్ణని చేతులెత్తేవారు. అసలు మీరూ ఒక మనిషైతే ఈ పెళ్ళి చేసుకునేవారే కాదు. అయినా, నా కీ శాస్తి జరగవలసిందే! మిమ్మల్నని ఏం ప్రయోజనం! ఇరవై ఏళ్ళొచ్చి ప్రపంచ జ్ఞానం లేని శుంఠలాగా మీలాంటి నయవంచకుల్ని నమ్మినందుకు శిక్ష నేనే అనుభవించాలి. మీరు మాత్రం ఆనందంగా ఉండండి. వెళ్తాను."

కన్నీళ్ళు అరికట్టుకుంటూ త్వరత్వరగా వెళ్ళిపోయింది. 'ఆ రోజు తరువాత మళ్ళీ ఈవేళ... అసలు అతడు తనకి చేసిన అన్యాయాని కీవేళ హోటల్‌నుంచి వీధిలోకి ఈడ్చించేది పోయి ఇంటి కెందుకు తీస్కొచ్చినట్టు!' ఆలోచిస్తూనే ప్రక్కకి తిరిగింది. ప్రక్కనే భర్త అశోక్! వందన కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. "మీ రెప్పుడొచ్చారు? పలకరించనైనా లేదు. కనీసం శబ్దం కూడా చెయ్యలేదు.'

అశోక్ పెదవులు చిరునవ్వు చిందించాయి. "కావలసినంత చప్పుడు చేశాను. అయినా, నీలో చలనం ఉంటేగా! పుస్తకం గుండెమీద పడేసి అంత సీరియస్‌గా ఆలోచిస్తుంటే డిస్టర్బ్ చెయ్యడానికి భయమేసింది. కొత్తావేమోనని! యోగముద్రలోంచి దేవిగారు బయటపడే క్షణంకోసం ఓపిగ్గా ఎదురుచూస్తున్నాను. ఇంతకీ సంగతేమిటి?"

వందన ముఖం చిన్నబోయింది. "ఈ రోజు మన హోటల్‌లో రాధాకృష్ణ కన్పించాడండీ!" అంటూ అతణ్ణి ఇంటికి తీసుకురావటం వరకూ చెప్పింది. "అతణ్ణి చూడగానే ఎంత వద్దనుకున్నా గతం జ్ఞాపకం వచ్చింది. దానితోపాటే నామీద నాకు చెప్పలేనంత అసహ్యం కూడా."

"వందనా! అదే వద్దన్నాను. నీ కెన్నిసార్లు చెప్పాలి? తప్పులు చెయ్యటం మానవ సహజం. తెలిసో, తెలియకో చేసిన ప్రతి తప్పుకీ మనల్ని మనమే అసహ్యించుకుంటే ఏ మనిషీ ఎంతోకాలం బ్రతకలేడు. అనవసరంగా పిచ్చి పిచ్చి ఆలోచనలు చెయ్యటం మానేసి నిద్రపో! రేపతణ్ణి తిట్టకుండా, కొట్టకుండా ఇంటికి పంపించెయ్యి—అదే అతనికి శిక్ష.".

"భజంత్రీలు కూడా ఏర్పాటు చెయ్యనా!" వందన కోపంగా అడిగింది.

"అత నిష్టపడితే తప్పకుండా! మరింక మాటలు బంద్." రైటార్ఫ్రశా డతను.

మర్నాడు ఉదయం ఎనిమిది గంట లవుతోంది. పిల్లలు స్కూలుకి వెళ్ళిపోయారు. వేడి కాఫీ తాగుతూ పేపరు చదువుతూ అశోక్ లేవటంకోసం ఎదురు చూస్తోంది వందన.

పనిమనిషి వచ్చింది. "అమ్మగారూ! ఆ గెస్ట్ రూమ్‌లో ఉన్నాయన లేచిండు. వాంతి సేసుకుంటుండు."

పేపరు పక్కకి పెట్టి రాధాకృష్ణ రూమ్‌లోకి వెళ్ళింది వందన. అతను అప్పుడే బాత్‌రూమ్‌లోంచి ముఖం తుడుచుకుంటూ నీరసంగా తేలిపోతున్న కాళ్ళతో వచ్చి బెడ్‌పై కూలబడ్డాడు. అతనికి అంతా అయోమయంగా ఉంది. రాత్రి హోటల్‌కి వెళ్ళటంవరకూ గుర్తుంది. 'ఇది ఎవరిల్లు? ఇక్కడి కెలా వచ్చాడు తను?' గది తుడవడాని కొచ్చిన పనిమనిషిని అడగబోయేలోపునే రివ్వుమంటూ వెళ్ళిపోయింది. అడుగుల చప్పుడు విని నీరసంగా తలెత్తాడు. తెరిచిన నోరు తెరిచినట్టే ఉండిపోయింది. 'హాంగోవర్ కాదు కదా!' అనుకుంటూ కళ్ళు రుద్దుకున్నాడు.

వందన సోఫాలో కూర్చుంటూ అడిగింది: "ఎలా ఉందిప్పుడు? తాగేటప్పుడు మన కెపాసిటీ గుర్తుంచుకుని తాగితే మంచిది కదూ!"

రాధాకృష్ణకి మాట పడిపోయినట్టుంది.

"ఎందు కంత ఆశ్చర్యం? నేను దయ్యాన్ని కాదు. వందనని. గుర్తున్నానా?"

మూ గగా తలూపాడు. "రాత్రి నువ్వు కొత్త అల్లుడిలాగా సుష్ఠుగా తాగేసి ఒళ్ళు మర్చిపోయిన హోటల్ మాదే! వెయిటర్లు ఏం చెయ్యాలో తోచక కొట్టుకుంటుంటే మా ఇంటికి తీస్కొచ్చాను మానవత్వం చావక."

ఇంతలో అశోక్ వచ్చాడు. "నువ్వెక్కడున్నావా? ఇంత ప్రొద్దున్నే ఎక్కడికి మాయమయిపోయావా అని ఇల్లంతా వెతుక్కుంటున్నాను."

"రండి,రండి." సోఫాలో జరుగుతూ రాధాకృష్ణ వైపు తిరిగి పరిచయం చేసింది. "ఈయన




మాబారు అశోక్.ముందుగా ఈయన హొటల్లో మేనేజరయ్యాను. తరువాత..."

"నా జీవితానికి మేనేజరయింది..." నవ్వుతూ పూర్తి చేశాడు. తనూ నవ్వుతూ భర్తతో అంది:

"ఇతని గురించి మీకు చాలా సంవత్సరాల క్రిందట చెప్పాను. నన్ను పెళ్ళివరకూ తీసుకెళ్ళి పిక్కబలం చూపించిన రాధాకృష్ణగారు."

"మీరేమీ అనుకోకండి. వందనలో క్షమించే స్వభావం లేదు." ముక్తసరిగా అనేసి వెళ్ళిపోయాడు అశోక్.

రాధాకృష్ణ చిన్నబోయిన ముఖంతో అడిగాడు:"వందనా! నువ్వేన్నన్నా భరించటానికి సిద్ధమే! కాని, ఇదెలా సాధ్యం?"

వందన బుసకొట్టింది. "ఏది సాధ్యం కాదు? నేను బ్రతికి ఉండటమా? లేక బాగుండటమా? నగటు ఆడపిల్లలా మోసపోయినంత మాత్రాన ఇంక జీవితమే లేదనుకుంటూ ఆత్మహత్య చేసుకుంటాననుకున్నావా? లేక మగాళ్ళందరూ నీవంటి మేకవన్నె పులులనుకున్నావా? నీ పుణ్యమా అని పరీక్షలు వ్రాయలేకపోయాను. రెండేళ్ళ కష్టాన్ని గంగలో కలుపుకుని ఇల్లు చేరుకున్న నన్ను అన్నయ్య అర్థం చేసుకుని ఆత్మబలాన్నిచ్చాడు. హొటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో జాయిన్ చేశాడు. అది కాగానే తన స్నేహితుడు కొత్తగా ప్రారంభించిన ఈ హొటల్‌లో మేనేజరయ్యేలా చూశాడు. ఆ రోజు కొత్త జీవితం ప్రారంభించమని ఏ శుభక్షణంలో అన్నాడో! దేవతలూ 'తథాస్తు' అన్నట్లుగా అన్నయ్య, ఆయన ఇద్దరూ దేవుళ్ళుగా నాకు కొత్త జీవితాన్నే ప్రసాదించారు. ఆ రోజు శాపమనుకున్నదే వరంగా మారుతుందనుకోలేదు. మీవంటి గడ్డివరక నన్ను కాదన్నందుకు విచారించాను, వటవృక్షం నీడలో సేదతీరుతానని తెలియక."

ఊపిరి పీల్చుకుంది వందన. ఆమెలో ఆవేశం జారిపోయింది."పోనీండి! మనుషులు ద్రోహం చేసినా దేవుడు చెయ్యలేదు."

విచారంగా నిట్టూర్చాడు."నేను రిజైన్ చేసిన తరవాత చాలా అమెరికన్ యూనివర్సిటీలకి వందలకు వందలు ఖర్చు పెట్టి అప్లై చేశాను. దాదాపు అన్ని యూనివర్సిటీలు గ్రాడ్యుయేట్ రికార్డ్ ఎగ్జామినేషన్ స్కోర్సు కావాలన్నాయి. ఆ పరీక్ష ఎంత ప్రయత్నించినా పాస్ కాలేకపోయాను. దానితో ఎక్కడా అడ్మిషన్ రాలేదు. పోనీ, అక్కడికి వెళ్ళి ట్రై చేద్దామంటే స్పాన్సర్ చేసేవాళ్ళు లేరు. ఫారిన్ రిటర్న్డ్ భర్త కావాలనే ఆ స్త్రీ లేకపోగా జంఝాటాలున్న నన్ను చేసుకుంది మా ఆవిడ. ఆ సరదా తీరకపోవడంతో నా మీద కోపం పెంచుకుంది. నేను అసమర్థుణ్ణి అని ఆమెకి విపరీతమైన చులకన.దానికి తోడు నా అజాగ్రత్త వల్ల నీ ఉత్తరాలు తను చూడటం జరిగింది: నా దగ్గర్నుంచి మన సంగతంతా రాబట్టింది. అప్పట్నుంచీ నే నంటే మరీ మండిపోతూంది. అక్కడ ఉండలేక అతి కష్టంమీద ఇక్కడ ఒక ట్యుటోరియల్ కాలేజిలో ఉద్యోగం సంపాదించుకుని వచ్చేశాను. లోకానికి జడిసి నాతో వచ్చింది. ప్రతి రోజూ నన్ను మాటలతో కుళ్ళబొడుస్తూ రోజుకో నరకాన్ని చూపిస్తూంది. నన్ను కుక్క కన్నా హీనంగా ట్రీట్ చేస్తూంది. అలవాటయిపోయినా అప్పుడప్పుడూ కనీసం ఓ నాలు గైదు గంటలు డ్రింక్స్ మత్తులో సేద దీరటం నేర్చుకున్నాను."

వందన మెల్లగా అంది: "నేను శాడిస్ట్‌ని కావచ్చు. నా కందుకో నీ మీద జాలి వెయ్యటం లేదు. 'చేసుకున్న వాళ్ళకి చేసుకున్నంత మహాదేవా' అని పెద్దలు ఊరకనే అన్లేదు. ఆయ నొచ్చినట్లున్నారు- టిఫిన్ తీస్కుందాం!"

టిఫిన్ తినేసి అశోక్ లేచాడు. "వందనా, నేను వెళ్తాను."

వందన తల ఊపింది. అశోక్ రాధాకృష్ణ దగ్గర వీడ్కోలు తీసుకుని వెళ్ళిపోయాడు.

రాధాకృష్ణ దృష్టి టిఫిన్ తింటున్నంత సేపూ డైనింగ్ టేబిల్ పక్కగా, క్రోకరీ కాబినెట్‌పై ఉన్న పిల్లల ఫోటోమీద ఉంది. పిల్లలిద్దర్నీ బస్ట్ సైజులో కలర్ ఫోటో తీయించి అక్కడ పెట్టింది వందన.

"వందనా! నిన్నో మాట అడగనా?"

"అడుగు."

"ఆ ఫోటోలో ఉన్న పెద్ద బాబు మన బాబు అయి ఉంటాడు. అవునా?"

వందన చెయ్యి విసురుగా గాలిలోకి లేచింది రాధాకృష్ణ చెంప పగల గొట్టటాని కన్నట్లు.అతి కష్టంమీద నిగ్రహించుకుంది. తీవ్రంగా అడిగింది:

"సిగ్గు లేదూ ఆ మాట ఇన్నేళ్ళ తరవాత అడగటానికి..."

"ఎందు కంత కోపం,వందనా! ఆ రోజు నువ్వు చెప్పిన మాటని బట్టి మన బిడ్డేమోనని..."

"మన బిడ్డ... ఛీ! వినటానికే ఇంత అసహ్యంగా ఉంది. ఇంక కని పెంచడం కూడానా!" ఒళ్ళు కంపరంగా విదిలించుకుంది.

"అయితే మరి..."రాధాకృష్ణ గొంతులో పజిల్ స్పష్టంగా అడగటానికి రవంత భయం.

"అప్పుడే అబార్షన్ చేయించుకున్నాను."

"వందనా! ఆడవాళ్ళకి మాతృత్వమంటే మమకారం అంటారు. ఎలా చేయగల్గావ పని?"

"చేయక, హేయమైన ప్రతిరూపాన్ని నవ మాసాలు మోసి, కని, వాడు కళ్ళ ముందు కదలాడే ప్రతి క్షణం నువ్వు చేసిన మోసాన్ని, నా తెలివితక్కువతనాన్ని గుర్తుకి తెస్తుంటే, మనిద్దరం చేసిన తప్పుకి లోకం నన్ను కుళ్ళబొడుస్తూ ఇక్కట్లుంటే, అది అనుభవించాలా? ఎవరి కోసం? ఏ ఆనందం కోసం? పోనీ అన్నీ అనుభవించినా చివరకి ఆ బిడ్డ ముందే శీలం లేని ఆడదిగా, దోషిగా నిలబడాల్సిన పరిస్థితి వస్తుంది.వాడు 'నాన్న ఎవరు' అని అడిగితే! పిల్లలంటే ఆడదానికి మమకారం అనే మాట నిజమే! కాని, ఆ మాతృత్వం ఆడదానికి గర్వకారణంగా ఉండాలి. సిగ్గుతో, అవమానంతో చితికిపోతూ, క్షణానికో నరకాన్ని చూపించేదిగా ఉండకూడదు. నిజానికి ఇలాంటి పిచ్చి సెంటిమెంట్లతో బతుకు తగలేసుకొనే ఆడపిల్లలంటే పరమ అసహ్యం నాకు. నావంటి అమాయకురాలు ఎక్కడైనా తారసపడితే నేను ఇదే సలహా ఇస్తాను. అశోక్ వంటి సహృదయులు అందరికీ దొరక్కపోవచ్చు. అయితే ఏం! పెళ్ళి ఒక్కటే జీవితానికి పరమార్థం కాదు. మగవాడి అండ లేకుండానే జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చు.

వాళ్ళిద్దరూ మా బిడ్డలు. చూశారా! ఎంత గర్వంగా చెప్తున్నానో! అదే ఆడది కోరుకునే మాతృత్వం. మగవాడు తప్పు చేసికూడా రాజాలాగా బతికేస్తుంటే, ఒక్క తప్పుకి ఆడది జీవితాంతం కుళ్ళిపోవాలా? మీ దారిన మీరు వెళ్ళిపోతే పెళ్ళికాని తల్లిగా సినిమాల్లో కంటికి కడివెడు కన్నీరు కారుస్తూ, ప్రేమ చిహ్నాన్ని అపురూపంగా పెంచుకొనే మూర్ఖ హీరోయిన్‌లాగా నేను ఉండాలని అంతరాంతరాల్లో ఆశ పడ్డా వన్న మాట.నీ బ్రతుకు నీకో గుణపాఠం నేర్పి ఉంటుం దనుకున్నాను. అదేం లేదు. అదే స్వార్థం! అసలు నీ బతుకు బాగోక నా కోసం, 'మన బిడ్డ' కోసం అడిగావు. అదే వేరే విధంగా జరిగి ఉంటే నేను గుర్తొచ్చేదాన్నే కాదేమో!"

రాధాకృష్ణ తల వంచుకుని గొణిగాడు."నన్ను క్షమించు, వందనా!"

అయిదు నిమిషా లయ్యాక లేచాడు. "నేను వెళ్తాను, వందనా! నువ్వు చేసిన సహాయానికి కృతజ్ఞుణ్ణి."

"ఒక్క మాట.ఇంటి దగ్గర నువ్వు అతిథివి. హొటల్లో మాత్రం అందరు కస్టమర్లలా ఒకడివి. రాత్రి నీ బిల్ 178 రూపాయ లయింది. పే చేసి వెళ్ళు."

'వందన మారిందనే అనుకున్నాడు తనింత సేపు. అసలు కొత్త జన్మ ఎత్తింది' అనుకుంటూ జేబులో చేతులు పెట్టాడు రాధాకృష్ణ. ✱

